# చెదిరిన కల

''అన్నివిధాల అదృష్టవంతురాలివే నీలీ! పెద్ద ఉద్యోగస్తుదే నీ భర్త! పైగా ఎంత మంచివాడే" పెళ్ళికి వచ్చిన చుట్టాలంతా నీలిమను పొగుడుతూనె ఉన్నారు.

అందరూ అలా భర్తను పొగుడుతుంటే నీలిమకు ఎందుకో చికాగ్గా అనిపించింది.

నీలిమ కంటికి భర్త పెద్ద అందంగాను అనిపించలేదు. పెద్ద ఉద్యోగస్థుడుగాను కనుపించలేదు. పైగా సరదగా లేడని విసుక్కుంది.

"పెళ్ళి పీటమీద ఆ విసుగేమిటీ! అంతమంచి భర్త దొరికితే ఆ చికాకేమిటీ! కాస్తనవ్వుతూ పెట్టు ముఖం. ఫోటోల్లో అష్టవంకరగా పడతావు" తల్లి ఎవరుచూడకుండా మందలించింది.

నీలిమ తల్లితండ్రులకి మాత్రం చాలా సంతోషంగా ఉంది. పెళ్ళిలో వియ్యాలవారు కట్నకానుకలకోసం ఎక్కువ పేచీ పెట్టలేదు. ఆ సౌకర్యాలు లేవు ఈ సౌకర్యాలులేవని గొడవ చెయ్యలేదు. పైగా

ఎంతో కలివిడిగా ఉన్నారు.

"ఈ కాలపు వియ్యాలవారిలాగె లేరు! అమ్మాయి అన్నివిధాల అదృష్టవంతురాలు!" అనుకున్నారు.

ఆమె మనస్సులో మధు నిలిచాడు. "మధు చాలా అందంగా ఉంటాడు. పైగా ఇంజనీరు. బాగా డబ్బున్నవాడు. ఎంత సరదాగా ఉంటాడో! నాన్న అంత కట్నం ఇచ్చుకోలేనన్నాడు. లేకపోతే మధుతో తన పెళ్ళి జరిగిపోయేది." మధు దివిటీల ఉంటె తన భర్త దీపంలా ఉన్నాడనుకుంది నీలిమ. ఆమె మనస్సు కల్లోలమైపోయింది. అంత అందగాడు, సరదాయైన వాడు తనకు భర్తగా లభించలేదని పెళ్ళిలో బాధపడుతూనె ఉంది. తనలాగె ఎంతమంది ఆడపిల్లలు ఈ బలవంతపు పెళ్ళిళ్ళతో బాధపడుతున్నారో!" అనుకుంది అయినా భర్తతోపాటు ప్రయాణమై మద్రాసు వెళ్ళింది.

టీనగర్‌లో ఇల్లు. రఘు పెళ్ళికి ముందె ఇంటికి కావలసిన సామానంతా కొన్నాడు. ఎంతో సౌకర్యంగా ఉంది యిల్లు. ఇంట్లో స్కూటరుంది. ఆఫీసుకి బస్సుసౌకర్యముంది.

"మధుకైతె చక్కగా కారుంది." మనస్సులో బాధపడింది నీలిమ.

"ఏం నీలిమా? అలా ఉన్నావేం! ఏం తోచడంలేదా?" అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన రఘు ఆప్యాయంగా అడిగాడు.

"ఏంలేదు" ముక్తసరిగా సమాధాన మిచ్చింది నీలిమ.

"పోనీ సినీమాకి వెడదామా!" బట్టలు మార్చుకుంటూ అడిగాడు రఘు.

"ఇదే మధు అయితే ముంగురులు సవరిస్తూ అడిగేవాడు" నీలిమ మనస్సు మూలిగింది.

"లే బట్టలు మార్చుకో! సినీమాటైం అవుతోంది." రఘు ముఖం

కడుక్కొని తల దువ్వుకుంటూ తొందర చేసాడు.

పెళ్ళవగానె తల్లి తండ్రుల్ని, ఆ యింటిని వదలి రావడంవల్ల అలా ఉందనుకున్నాడు. రఘు.

ఇద్దరు సినీమాకు బయలుదేరారు. ఎక్కువ రద్దీలేకపోడం మూలంగా మొదటి ఆటకు టిక్కట్టు దొరికింది.

విశ్రాంతి సమయంలో" నీలిమా! టీ తాగుతావా? కూల్‌డ్రింక్ తాగుతావా" రఘు అడిగాడు.

నీలిమ సమాధానం చెప్పకుండానె రఘు కూల్‌డ్రింక్ సీసా ఆమె చేతికందించాడు. అతను సీట్లోంచి లేచి బయటకు వెళ్ళాడు.

"అదేం ముఖమో! ఎప్పుడూ నవ్వించదు. మధు అయితే ఎంత నవ్వించేవాడో!

ఒకరోజు నీలిమ, మయూరి, విశాలి కలిసి సినీమాకు వెళ్ళారు. అక్కడకు మధు స్నేహితులతో వచ్చాడు. నీలిమను చూడగానె స్నేహితులను వదలి "హాయ్" నీలిమా అంటూ తన దగ్గరకు వచ్చాడు.

"ఎంత అందంగా ఉన్నావు నీలిమా! ఆ చీరలో అప్సరసలా ఉన్నావు? ఈ సినీమా నాయికలంతా నీముందు దిగతుడుపే" అన్నాడు పకపకనవ్వుతూ! ఆ మాటలకి నీలిమతోపాటు మయూరి, విశాలి కూడా పకపక నవ్వారు!

'నీలిమగారూ! మా కోరిక మన్నించండి" అంటూ కూల్‌డ్రింక్ సీసా అందించాడు. "ఎంత సంతోషంగా తాగిందో.

నీలిమ ఆకలలో ఉండిపోయింది. లైట్లు ఆరిపోయాయని కూడా ఆమెకు తెలియలేదు.

"నీలిమా! ఇంకా కూల్‌డ్రింక్ తాగలేదా?" రఘు మాటలకి ఈ

లోకంలోకి వచ్చిన నీలిమ గబగబా కూల్ డ్రింక్ తాగేసింది. కాళీ సీసా అతని చేతికి అందించింది.

మరోరోజు రఘు ఆఫీసునుంచి త్వరగా యింటికి వచ్చాడు.

"నీలిమా! ఈరోజు బజారు కెడదామా! సరకు లేవో కావాలన్నావుగా" రఘు మాటలు వినగానె నీలిమ గబగబా తెములడం మొదలు పెట్టింది.

ఇంట్లో వంటరిగా తోచడంలేదు. ఇరుగు పొరుగు వారికి తెలుగు రాదు. అరవ భాషలో ఏదో ఏదో ఆడుగుతారు. నీలిమకి ఆ భాష అర్థం కాక మరింత చికాగ్గా ఉంటోంది. పైగా తనకు స్నేహితులు కాని చుట్టాలు కాని మద్రాసులోలేరు.

రఘు ఆఫీసులో కొంత మంది తెలుగు వాళ్ళున్నారట- వాళ్ళ భార్యలు ఊళ్ళోలేరు. ఎక్కడకీ వెళ్ళడానికి లేదు. అసలే చికాగ్గా ఉన్న నీలిమకి మరింత చికాగ్గా ఉంటోంది. అందుకే రఘు బయటకు వెడదామనగానె వెంటనే తెములడం మొదలు పెట్టింది.

నీలిమ అంత త్వరగా తయారవుతున్నందుకు రఘు ఆశ్చర్యపోయాడు,

ఓ పెద్ద షాపులోకి తీసుకు వెళ్ళాడు రఘు.

"నీలిమా! నీకు నచ్చిన చీర తీసుకో!" అన్నాడు నవ్వుతూ!

ఆ మాటల్లో ఏదో ఆత్మీయత — నీలిమ తలెత్తి రఘు వైపు చూసింది. ఆ చూపుల్లో ఏదో చిలిపితనం. ఆ చూపులు ఆమెకు కొత్తగా అనిపించాయి. కంగారుగా చూపులు మార్చుకుంది.

నీలిమ చీరలు చూసింది. అన్నింటిలో రెండు చీరలు నీలిమ కంటికి అందంగా కనపడ్డాయి. అందులో ఒకటి పదిహేను వందలు.

మరొకటి ఏడువందలు. మొదటి చీర తీసుకోడానికి మొహమాట పడింది. రెండవ చీరె తీసుకుంది.

"నీకు నచ్చిన చీరె తీసుకో నీలిమా!" అన్నాడు రఘు మరో సారి.

"ఇది బాగుంది" ఏడు వందల చీరె తీసుకుంది. రఘు నవ్వుకున్నాడు. అతనెందుకు నవ్వుతున్నాడో తెలీక తికమక పడింది నీలిమ.

బట్టల దుకాణంలో కూల్ డ్రింక్ లు తెప్పించారు. అందుకే రఘు వేరుగా ఏమిప్పించలేదు. ఇమిగిలిన సామానులు కొని భార్యను తీసుకుని యింటికి వచ్చేసాడు.

నీలిమ మనస్సు మళ్ళీ చివుక్కుమంది. అలా ఏమైన కొనుక్కోడానికి బజారుకు వచ్చినప్పుడు హోటల్లో భోం చేసి యింటికి వెడితే ఎంత బాగుంటుంది. సరదాగాను ఉంటుంది. పైగా ఇంట్లో వంటపనీ తప్పుతుంది. నీలిమ మనస్సు ఎటుకో వెళ్ళింది. మధు అయితే తప్పకుండా తీసుకువెళ్ళేవాడు. తన సుఖాలు చూసేవాడు. తన సంతోషాలు చూసేవాడు. తనకా అదృష్టంలేదు. ఎలాగో అలాగ జీవితం సరిపెట్టుకోవాలి. కుర్చీలో అలాగె కూర్చుండి పోయింది నీలిమ.

"నీలిమా! అలా కూర్చున్నావేం! నీరసంగా ఉందా! వంట నేచేస్తాలే" రఘు వంట యింటివైపు నడిచాడు.

"మా పిల్లకి కాస్త గారం ఎక్కువబాబు! కాస్త జాగ్రత్తగా నువ్వే కనిపెట్టిచూడాలి. ఇక తల్లివైన, తండ్రివైన, భర్తవైన నువ్వే" అత్తమామలన్నమాటలు అతనికి జ్ఞాపకానికి వస్తూనే ఉంటాయి.

"బజారు తిప్పి నీలిమను ఇబ్బంది పెట్టానేమో" అనుకున్నాడు రఘు. అందుకే వంట చెయ్యాలనుకున్నాడు.

భర్త మాటలకు ఈ లోకంలోకి వచ్చిన నీలిమ గబగబా కుర్చీ

లోంచి లేచింది. బట్టలు మార్చుకుని భర్తకు వంటలో సహాయం చెయ్యడానికి బయలుదేరింది.

రోజులు గడిచిపోతున్నాయి. నీలిమ ఒకరోజు కాస్త నవ్వుతూ ఉంటుంది. మరోరోజు ముభావంగా ఉంటుంది.

రఘు ఎంత ప్రయత్నించినా ఆమె మనస్సులో ఏముందో మాత్రం తెలుసుకోలేకపోయాడు.

"అమ్మాయి వెళ్ళి చాలా రోజులయింది. తల్లి నీలిమను చూడాలని కలవరిస్తోందని, అమ్మాయిని తీసుకువెళ్ళడానికి నేను వస్తున్నానని తండ్రి ఉత్తరం రాసాడు. ఉత్తరం ఇంటి అడ్రస్సుకే వచ్చింది. ఆ ఉత్తరం చదువుకున్న నీలిమ సంతోషానికి అంతులేదు. చిన్నపిల్లలా గంతులు వేసింది. రఘు ఆఫీసునుంచి రాగానే ఉత్తరం అతని చేతికిచ్చింది.

కలకల్లాడుతున్న నీలిమ ముఖం చూడగానే అతనికి అర్థమైపోయింది. ఉత్తరం పూర్తిగా చదివే లోపలే నీలిమ కాఫీ పట్టుకొచ్చి అందించింది.

"నీలిమా! అయితే నువ్వు మీవూరు వెడతావా?"

"వెడతానన్నట్లు తలూపింది."

"మీ నాన్నగారు వచ్చి తీసుకువెళ్ళడందేనికి? నేనే వస్తాను?" రఘు అంత తేలిగ్గా వప్పుకుంటాడనుకోలేదు. సంతోషంతో గంతు లెయ్యాలనుకుంది.

"అతను వప్పుకునేదేమిటి? తను వెళ్ళలేదా? అతను వద్దన్నా తను వెళ్ళగలదు? కాని తనదగ్గర నయాపైసలేదు. తనకు తగిన చదువులేదు. సంపాదనలేదు. అందుకే అటు తల్లిదండ్రులు, ఇటు రఘు తనని కీలుబొమ్మలా ఆడిస్తున్నారు. వాళ్ళు కొన్నబట్టలే కట్టు

కోవాలి. వాళ్ళు చెయ్యమన్నపనే చెయ్యాలి?" ఇది బాగులేదు. తనకు స్వతంత్రం కావాలి. తను పుట్టింటికి వెళ్ళాలంటే వెళ్ళాలి. అత్తింటికి రావాలంటే రావాలి. అలా పరిపరివిధాల ఆలోచించింది.

మళ్ళీ అంతలోనే తనకు కావలసినదల్లా తల్లిదండ్రులు చేస్తు న్నారు. ఇటు రఘు చేస్తున్నాడు. తనకు ఇబ్బందంటే తెలీదు. తను సుఖంగా ఉంది" అనుకుంది మనస్సులో.

కొండంత సంతోషంతో రఘుతోపాటు విజయవాడ బయలు దేరింది నీలిమ.

ఒకపక్క తనవాళ్ళని చూడ్డమేకాదు మధుని చూడాలనే కోరిక కూడా నీలిమను తొందరచేసింది. "మధు ఎలా ఉన్నాడో? ఇంజనీరుగా ఎక్కడ పనిచేస్తున్నాడో? అతనికి పెళ్ళయిందో లేదో? భార్య ఎలా ఉందో? తనకంటె అందంగా ఉందో లేదో?" నీలిమ ఆలోచనలు పరి పరివిధాల పోతున్నాయి.

గుమ్మంలో దగ్గానె తల్లిని కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్చింది. తర్వాత తండ్రిని కౌగలించుకుని ఏడ్చింది.

వెళ్ళి నాలుగు మాసాలయినా నాలుగు సంవత్సరాలయినట్లు బాధపడ్డారు ఆ ముగ్గురు. రఘు వింతగా చూస్తూ నిలబడ్డాడు.

"రాబాబూ! రా!" తేరుకున్న తల్లిదండ్రులు అల్లుణ్ణి లోపలకి ఆహ్వానించారు. రఘు, నీలిమలు స్నానాలుచేసి భోజనాలు చేసారు.

"నీలిమా! నేను మావూరు వెళ్ళాలనుకుంటున్నాను. నువ్వొ వస్తానంటె రేపటివరకు ఆగుతాను. లేకపోతే ఈపూటె నేవెళ్ళిపోతాను." అత్తమామలు అక్కడ లేకుండా చూసి రఘు భార్యను అడిగాడు.

"నేనిప్పుడు రాను. నే తర్వాత వెడతాను." నీలిమ సమాధానం

విని రఘు వాళ్ళూరు ప్రయాణమయ్యాడు. అత్తమామలు ఒక్కరో జుండమని ఎంత బతిమాలినా వినలేదు. శలవులేదని వెంటనే బయలు దేరాడు.

నీలిమ గట్టిగా ఊపిరి పీల్చుకుంది. రఘు ఉంటె మయూరి, విశాలీలతో తనివితీరా మాట్లాడుకోడానికుండదు. పైగా ఊళ్ళో తిరగ డానికుండదు. మధుని చూడడానికుండదు. అందుకే భర్త వెడతానంటె మరీ సంతోషపడింది. పుట్టింట్లో ఉన్న ఆడపిల్లకి భర్త బరువే అను కుంది.

నీలిమ నిద్రపోయి లేవకుండానే మయూరి వచ్చింది. విశాలికి పెళ్ళి కుదిరిందిట. పెళ్ళి పనులతో విశాలి తీరికలేకుండా ఉందని చెప్పింది.

ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఆ కబుర్లకి అంతేలేదు.

"నీలీ! మధు సంగతివిన్నావా?" మయూరే అడిగింది.

"నాకేం తెలీదు?" నీలిమ సమాధానమిచ్చింది.

"ఆ మహానుభావుని సంగతి వినవలసిందే. ఈ షోకులరాయుడు ఇంజనీరింగ్ పూర్తి చెయ్యలేకపోయాట్ట. ఈయన చదువు పేరు చెప్పి తండ్రి లక్షలకట్నంతో లక్షణమైన అమ్మాయినిచ్చి పెళ్ళిచేసాడు.

పెళ్ళయ్యాక ఈ ప్రబుద్ధుడి సంగతి బయటపడింది. మామగా రిచ్చిన కట్నండబ్బు చేతిలో ఉన్నట్లుంది. రోజుకో అమ్మాయిని కార్లో కూర్చోపెట్టుకుని సినిమాలకి, షికార్లకి తిప్పడం. అవసరం తీర్చు కోగానే ఇంటిదగ్గర వదిలిపెట్టడం. ఇది మధుగారి భాగోతం. అందం ఉంది. డబ్బుంది. అమ్మాయిలంతా అతని వెంటపడతారు. అతనేం చెబితే అదే వింటారు. కాని భార్య అతన్ని నమ్మలేదు. రాత్రి ఒక్క రోజు వేళకు ఇంటికి రాకపోతే ఆమెకు అనుమానమొచ్చింది. అత్త

మామల్ని "కొడుకుని అలా భయభక్తుల్లేకుండా ఎందుకు వదిలేసా"రని నిలదీసి అడిగింది.

"అమ్మా! వాడు మేంచెబితే వినడు. నువ్వే వాణ్ణి సరిదిద్దుకోవాల" అన్నారుట అతని తల్లిదండ్రులు.

"అతను మీమాట విననప్పుడు మీరెందెకు అతనికి పెళ్ళి చేసారని, కోర్టుకు వెడతానని" బెదిరించిందట. నిజంగానే కోర్టుకు వెళ్ళి మధుమీద కేసుపెట్టింది.

"అలాగా! మయూరీ! మరి తల్లిదండ్రులేమంటున్నారు?" నీలిమ కంగారుగా అడిగింది.

"ఏం చేస్తారు- అంత గారంచేసి కొడుకుని వదిలేసినందుకు బాధపడుతున్నారు. భయభక్తులు చెప్పకుండా కొడుకుని వీధినిపడేసినందుకు సిగ్గుపడుతున్నారు?"

వాడి ముఖం చూడ్డానికే అసహ్యం వేస్తోంది. ఎంతమంది ఆడపిల్లల జీవితాలు నాశనంచేశాడో? అసలీ ఆడపిల్లలకి బుద్ధిలేదు నీలిమా! వీళ్ళు పెళ్ళి కాకుండానే అతనిచుట్టూ తిరగడం దేనికి? అతనికి పెళ్ళయిందని తెలిసికూడా ఈ ఆడపిల్లలు అతనివెంట పడ్డారంటే ఆశ్చర్యంగా ఉంది కదూ!"

"నిజమే మయూరీ! ఆడపిల్లలది కూడా తప్పే" నీలిమ ఆలోచించింది.

అంతలో మయూరి కోసం ఎవరోవస్తే యింటికి వెళ్ళిపోయింది. నీలిమ వంటరిగా మిగిలింది. ఆలోచించే అవకాశం కలిగింది. ఈ మధూని నమ్మి ఈ మోసపోయిన ఆడపిల్లల్లో నేనొకత్తిని కాలేదు. యమే. మేడిపండులాంటి అందంచూసి నేనూ వెంటపడ్డాను. అతన్ని

చూడ్డానికి తహతహలాడాను. అతనిమాటలు నేతి బీరకాయలని తెలుసు కోలేక పోయాను.

ఇంత ఉన్నతుడైన రఘుని అతనితో పోల్చుకుని తప్పుపని చేసాను. రఘుని ఎన్నోసార్లు అవమానించాను. ఈసడించాను. అయినా అతను నామీద చూపించిన ప్రేమ నిష్కల్మషమైంది. చేసిన తప్పు సరిదిద్దుకోవాలి. ఆమెకల చెదరిపోయింది. ఆమె మనస్సు రఘుకోసం తహతహలాడింది.

25-208

"అమ్మా! నేను కూడా రఘువాళ్ళ ఊరు వెడతానమ్మా!" అంది నీలిమ తల్లితో.

Acc No. 30488

"ఈపూటే కదావచ్చావు? రేపెడుదువుగాని లేమ్మా!"

"ఇప్పుడే వెడతానమ్మా!" నీలిమ తనంతట తను ఆలోచించ గలదు. ఆచరించగలదు మంచిచెడు నిర్ణయించుకోగలదు.

ఒక్కొక్క సంఘటన మనసులో దాగున్న ఆలోచనల్ని తట్టి లేపుతుంది. కల కరిగిపోతే ఆలోచన మెరుపులా దూసుకువస్తుంది. స్వతంత్రశక్తిని కలిగిస్తుంది. నీలిమకు అదే జరిగింది. తలిదండ్రులు ఒద్దన్నా వినకుండా అత్తవారింటికి బయలుదేరింది. వెంటనే రఘుని కలుసుకోవాలి. ఆమె మరింత తొందరపడింది. ఆమెకంటే ముందు ఆమె మనస్సు పరుగులుతీసింది.

6-5-1994

* *